క్లుప్తంగా

అర్హులందరూ ఓటేయాలి



వర్ధన్నపేట : అర్హులందరూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేయాలని ఎంపీడీఓ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ జోనా కోరారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల చేత పిరంగిగడ్డ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రంగయ్య, మాస్టర్ ట్రైనర్ రాజు, మనేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



సంగెం : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తులకు మద్దతు ధర లభిస్తుందని తహసీల్దార్ జి.రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని చింతలపల్లిలో ఝాన్సీలక్ష్మీబాయి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆన ప్రారంభించి మాట్లాడారు. 'ఏ' గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, 'సీ' గ్రేడ్‌కు రూ 2,183 మద్దతు ధర అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాసర్ల రవీందర్, ఏపీఎం కిషన్, కార్యదర్శి రాజ్‌కుమార్, సీసీ బొజ్జ సురేశ్, వీఓ నాయకులు కవిత, రాధిక, మంజుల, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం కన్వీనర్‌గా విగ్నేశ్ గౌడ్



నర్సంపేట : బీజేవైఎం నర్సంపేట అసెంబ్లీ కన్వీనర్‌గా కొంకీస విగ్నేశ్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విగ్నేశ్ మీడియాతో మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, నియోజకవర్గ నేత డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు భరత్‌వీర్‌చక్ర, నియోజకవర్గ కన్వీనర్ నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

వర్ధన్నపేట : ప్రమాదవశాత్తు బావిలో పడిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కదారిగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.,. కట్ర్యాలకు చెందిన చెవ్వాల్ల చంద్రయ్య (56) ఆదివారం ఉదయం ఇంట్లోంచి బయటకు వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా కుటుంబ సభ్యులు సోమవారం చుట్టుపక్కల బావులు, చెరువులు, కుంటల వద్ద గాలించగా కదారిగూడెం శివారులోని వ్యవసాయ బావిలో పడి చంద్రయ్య మృతి చెందినట్టు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

చెన్నారావుపేట : తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని ఎల్లాయగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు వేముల ఎల్లాగౌడ్ కులవృత్తిలో భాగంగా కల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఎల్లాగౌడ్ కాలు విరిగి తీవ్ర గాయాల పాలయ్యాడు.

బాలల శారీరక వికాసమే ధ్యేయం

రాయపర్తి : బాలల శారీరక వికాసమే లక్ష్యంగా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని, పలు కార్యక్రమాలు చేపడుతోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సత్యవతి తెలిపారు. మండలంలోని మైలారంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో 3 నుంచి 6 ఏళ్ల వరకు వయస్సున్న బాలలకు ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) ప్రీ స్కూల్ గురించి సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలలకు పౌష్టికాహారం అందిస్తూ శారీరక, మానసిక ఎదుగుదలపై దృష్టి సారించాలని సూచించారు. పిల్లలు భాష నేర్చుకునే రీతులు, బడి సంసిద్ధత వంటి అంశాలపై తల్లులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పిల్లల అభివృద్ధి నమోదు కార్డులను తల్లులకు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, యమున, రాజేశ్వరి, హెల్పర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణల్లో నిజం లేదు


గీసుకొండ : మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన నాసం సూర్యనారాయణ తమపై చేసిన ఆరోపణల్లో నిజం లేదని రియల్ ఎస్టేట్ వ్యాపారులు డోలె చిన్ని, కోట రేణుక తెలిపారు. మండలంలోని కోనాయమాకులలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిన్ని, రేణుక మాట్లాడారు. ఊకల్‌లోని ఒకటిన్నర ఎకరాల భూమి కొనుగోలు విషయంలో వివాదం తలెత్తిందన్నారు.

నేడు పాంచాల రాయస్వామి జాతర

గీసుకొండ: మండలంలోని శాయంపేట హవేలీ గ్రామంలో అత్యంత ప్రాచీనమైన, విశిష్టమైన శ్రీ ఆది మహాలక్ష్మి సమేత పాంచాల రాయస్వామి జాతర నేడు (మంగళవారం) వైభవంగా జరుగనుంది. జాతర సందర్భంగా పరిసర గ్రామాల నుంచి భక్తులు ప్రభలు, ఎడ్లబండ్లతో తరలి వచ్చి ఇష్టదైవమైన శ్రీ కృష్ణుడికి పూజలు చేసి మొక్కులు సమర్పిస్తారు. బుధవారం సాయంత్రం స్వామి వారి ఆలయం నుంచి ప్రధాన వీధుల్లో రథోత్సవం జరుగుతుందని, దీంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ అర్చకులు కొండపాక రాంమూర్తి సోమవారం తెలిపారు. కాగా శాయంపేటలోని పాంచాల రాయస్వామి ఆలయానికి సుమారు 800 ఏళ్ల చరిత్ర ఉందని చెబుతున్నారు. ఆలయ ప్రాశస్త్యం శిలాశాసనాలు, పుస్తకాలు, ప్రజలు చెప్పుకునే కథల్లో పలు విధాలుగా చెప్పబడుతోంది.



ఆలయం వద్ద అర్చకులు, భక్తులు



శ్రీకృష్ణుడి మూల విరాట్

అసిస్టెంట్ ప్రొఫెసర్ శైలజకు సన్మానం



నర్సంపేట : శైలజను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ నవీన్, అధ్యాపకులు

నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మామిడాల శైలజను కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్, అధ్యాపకులు, మహిళా సాధికారత సెల్ సభ్యులు, బీఏ విభాగం సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. విమెన్ ఎంపవర్‌మెంట్ త్రూ 73, 74 అమెండ్‌మెంట్ అనే అంశంపై శైలజ చేసిన పరిశోధనకు గాను కాకతీయ విశ్వవిద్యాలయం పీహెడీ ప్రకటించింది. ఈ సందర్భంగా కళాశాలలో ఆమెను శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడారు. శైలజ డాక్టరేట్ పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ డాక్టర్ శివనాగ శ్రీను, మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్ సుమతి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ ఇంజనీర్ కళాశాల అధ్యాపకుడికి..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలం లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగ అధ్యాపకుడు రాగిడి రణధీర్‌రెడ్డిని డాక్టరేట్ పట్టా అందుకున్న సందర్భంగా కళాశాలలో చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సెక్రెటరీ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్ మాట్లాడారు. ప్రొఫెసర్ మణికందన్ పర్యవేక్షణలో రణధీర్ రెడ్డి రాజస్థాన్‌లోని కేరియర్ పాయింట్ యూనివర్సిటీలో ఏ నావల్ సాఫ్ట్ స్విచ్చింగ్ ఫుల్ బ్రిడ్జి-డీసీ టూ డీసీ కన్వర్టర్ యూజింగ్ పల్స్ విత్ మాడ్యులేషన్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారని చెప్పారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ నారాయణ, ఏఓ సురేశ్, ఈఈఈ విభాగాధిపతి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : రణధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



దుగ్గొండి : మండలంలోని శివాజీనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మాలగాని రామారావు, మాజీ అధ్యక్షుడు బుస్సారి రామారావు, ఆరె కుల పెద్ద బుస్సారి మనోహర్‌రావు, తదితరులు ఆ పార్టీకి రాజీనామా చేసి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో సోమవారం చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే మాధవరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, నాయకులు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, మాదాసి సాంబయ్య, భరత్ రెడ్డి, సుకినె నాగరాజు, ప్రభాకర్, ధర్మారెడ్డి, జనార్దన్, కన్నయ్య, సుకినె శ్రీనివాస్, గట్టికొప్పుల నర్సింహస్వామి పాల్గొన్నారు.

శంకుస్థాపన

గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌లోని శ్రీ నాగేంద్రస్వామి యాదవ సంఘం భవన నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు అల్లం మర్రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్, నాయకులు నరిశెట్టి నరేందర్, వేల్పుల సురేశ్, మాదాసి రాంబాబు, మర్రి ఎల్లయ్య, కుమారస్వామి, మర్రి రాజలింగం, కుమారస్వామి, నర్సింగరావు, యాకయ్య, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న నర్సింహరాములు, పుల్లారావు

ఖానాపురం : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ తరఫున మహబూబాబాద్ అభ్యర్థిగా బరిలో నిలిచిన సీతారాంనాయక్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ కన్వీనర్ నర్సింహరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి పుల్లారావు కోరారు. సీతారాంనాయక్ గెలవాలని కోరుతూ మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద ఆ పార్టీ నాయకులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహరాములు, పుల్లారావు మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి ప్రధానిగా మోడీ చేపట్టిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో రాణాప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, రాంచందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామ శివారులోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో దుండగులు సోమవారం తెల్లవారుజామున హుండీలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆలయ పూజారి గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్, క్లూస్ టీమ్ సిబ్బంది విచారణ చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి రెండు హుండీలను పగులగొట్టినట్టు సీసీ కెమెరాల్లో నమోదైందని, త్వరలో నిందితులను అరెస్టు చేస్తామని ఎస్సై చెప్పారు. ఇదిలా ఉండగా గ్రామంలో చీకటి కుమారస్వామి, అనుమాండ్ల రాములులకు చెందిన ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్యంలోనే బంగారు భవిష్యత్‌కు బాటలు

- సిద్ధార్థ స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్

సంగెం : బాల్యంలోనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా సిద్ధార్థ స్కూల్‌లో విద్యాబోధన సాగిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.సుధాకర్ తెలిపారు. మండలంలోని ముమ్మడివరంలోని ఆ స్కూల్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. యూకేజీ పూర్తి చేసుకున్న బాలలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. అనంతరం సుధాకర్ మాట్లాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్కూల్‌ను నడిపిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమణి, వందన, స్వప్న, కవిత, శాంతకుమారి, ప్రవళిక, నర్మద తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో చిన్నారులు

పోలీసుల తనిఖీ

నల్లబెల్లి : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మడలంలని బొల్లోనిపల్లి చెక్‌పోస్ట్ వద్ద వెస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడారు. అక్రమంగా మద్యం, నగదు తరలిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. చెక్‌పోస్టు వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు, సిబ్బందికి వివరించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ సందర్శించి రికార్డులను పరిశీలించారు. భద్రత పరమైన చర్యలపై సూచనలు అందించారు. డీసీపీ వెంట నర్సంపేట రూరల్ సీఐ రాజగోపాల్, ఎస్సై రామారావు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యుత్తమ బోధన



మాట్లాడుతున్న హెచ్‌ఎం సారంగపాణి

సంగెం : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యుత్తమ విద్యాబోధన లభిస్తోందని మండలంలోని ఎల్గూర్ రంగంపేటలోని ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం సారంగపాణి తెలిపారు. ఎల్గూర్ రంగంపేట, తిమ్మాపూర్, ఎల్గూర్ స్టేషన్ గ్రామాల పరిధిలోని తండాల్లో ఇంటింటికీ కరపత్రాలు అందిస్తూ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న సదుపాయాలను పరిశీలించి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పాలని తల్లితండ్రులను కోరారు. నెల రోజులపాటు ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించి చదువులు బాగుంటేనే పంపించాలని సూచించారు. స్కూల్‌లో లభిస్తున్న సదుపాయాలను వివరించారు. తండాల నుంచి విద్యార్థుల రాకపోకల నేపథ్యంలో రవాణకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, సుస్మిత, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

గీసుకొండ : మండలంలోని మొగిలిచర్ల, జాన్‌పాక గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించి గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పరకాల ఎక్సైజ్ ఎస్సై జ్యోతి వివరాలు వెల్లడించారు. మొగిలిచర్లలో డి.లక్ష్మి నుంచి 2 లీటర్లు, జాన్‌పాకలో ఎం.విజయ నుంచి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది శ్రీనివాస్, రవీందర్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల్ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ



రాంతీర్థంలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నల్లబెల్లి : గురుకుల్ సెట్‌లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి తెలంగాణ గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించడం అభినందనీయమని ముచ్చింపుల తండా పీఎస్ హెచ్‌ఎం పొరిక విజేత, రాంతీర్థం పీఎస్ హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల ఆవరణలో సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు మాట్లాడారు. బండారి శ్రీవేణి, భూక్య వెన్నెల, మిర్యాల కల్యాని, బానోత్ మనిత్, సంజన, కలకోటి జెస్సీ, అక్కపెల్లి నక్షత్ర, నవ్య, తనుశ్రీ, సాత్విక, కీర్తి 5వ తరగతిలో ప్రవేశాలు పొందినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ రవళి, ఉపసర్పంచ్ సురేందర్, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, జీపీ కార్యదర్శి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



ముచ్చింపుల తండాలో..

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఖానాపురం : మండలంలో నీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మౌనిక తెలిపారు. మండల కేంద్రంలో ఆమె మాట్లాడారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని చెప్పారు. నీటి ఎద్దడి ఏర్పడితే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కుల బహిష్కరణ సరికాదు

దుగ్గొండి : మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తుడు సోనబోయిన రవీందర్‌ను కుల బహిష్కరణకు గురి చేయడం సరికాదని మెపా జిల్లా కార్యదర్శి పెండ్యాల కృష్ణ అన్నారు. ఆ గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగుడైన రవీందర్ కుల సంఘంలోని డబ్బుల విషయమై ప్రశ్నించడంతో కుల సంఘం బాధ్యులు కక్షగట్టి శుభ, అశుభ కార్యాలకు పిలువకుండా, కులస్తులు మాట్లాడకూడదని కుల సంఘం బాధ్యులు నిర్ణయించారని తెలిపారు.

ఎంపీగా కావ్యను గెలిపించాలి

పర్వతగిరి : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచిన కడియం కావ్యను గెలిపించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కోరారు. మండలంలోని తూర్పుతండా మాజీ సర్పంచ్, ఇతర నాయకులు, ఇస్లావత్‌తండా నుంచి ఇస్లావత్ రమేష్ నాయక్, మూడు సునీత, వెంకన్న, మూడు శ్రీనివాస్, తదితరులు వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్, జెడ్పీటీసీ బానోతు సింగ్‌లాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రైతాంగ సంక్షేమానికి పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

గెలిపిస్తే మెరుగైన పాలన అందిస్తా



నెక్కొండ : సమావేశంలో మాట్లాడుతున్న కవిత



నర్సంపేట : మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత

నర్సంపేట : తనను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన పాలన అందిస్తానని బీఆర్‌ఎస్ పార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత తెలిపారు. పట్టణంలోని ఎంఏఆర్ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పదేళ్ల పాలన అందించిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. తనకు ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

బీఆర్‌ఎస్‌కు మించి అభివృద్ధి సాధ్యమా?

బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన దానికి మించిన అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందా అని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓట్లడిగే హక్కు లేదు

నెక్కొండ : రైతుల పట్ల మోసపూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను ఓట్లడిగే హక్కు లేదని బీఆర్‌ఎస్ పార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత అన్నారు. మండల కేంద్రంలోని మహేశ్వర గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించి రైతుబంధు, రైతుబీమా, తదితర పథకాలను అమలు చేయడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే చేపట్టిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసి అడ్డుకుంటోందని చెప్పారు.సమావేశంలో ఎంపీపీ రమేశ్ నాయక్, జెడ్పీటీసీ సరోజ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలోనే సమగ్రాభివృద్ధి

- వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్

వర్ధన్నపేట : బీజేపీ పాలనలోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి ఆధ్వర్యంలో మండలంలోని ఇల్లందకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు సోమవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి అరూరి రమేశ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశాన్ని అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి చేర్చేలా పార్టీ పదేళ్లుగా పాటుపడుతోందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలిచి కేంద్రంలో అధికారంలోకి వస్తే రాష్ట్రం దేశం గర్వించే స్థాయిలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తనను ఎంపీగా గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేయాలని ప్రజలను కోరారు. పార్టీలో చేరిన వారిలో అడప రాజు, మూల రాము, సట్ల రాజు, సట్ల అనిల్, గడ్డం కుమార్, గడ్డల మహేశ్, గడ్డం శ్రీనివాస్, తదితరులున్నారు.



పార్టీ కండువా కప్పుతున్న అరూరి రమేశ్

మోసపూరిత కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సంగెం : హామీలు విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని బీఆర్‌ఎస్ నేత, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని నల్లబెల్లి, బాలునాయక్‌తండా, నార్లవాయి, ముమ్మిడివరం, గొల్లపల్లి, మొండ్రాయి, పల్లారుగూడ, తదితర గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ దుష్ట, మోసపూరిత పాలన ప్రజలకు అర్థమైందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజాసంక్షేమానికి బాటలు పడగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో పూట గడుపుతోందని చెప్పారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. సమావేశాల్లో రెడ్‌క్రాస్ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సారంగపాణి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ మల్లయ్య, కోఆప్షన్ సభ్యుడు మన్సూర్ అలీ, నాయకులు సాగర్‌రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

సీతారాంనాయక్ గెలుపునకు కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న హామ్యానాయక్

రాయపర్తి : కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కడియం కావ్యను గెలిపించడమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్ కోరారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని గ్రామ కమిటీలతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో హామ్యానాయక్ మాట్లాడారు. ఈనెల 24న కావ్య నామినేషన్ వేయనున్న క్రమంలో శ్రేణులు తరలివాలని కోరారు. సమావేశంలో పాలకుర్తి ఆలయ కమిటీ చైర్మన్ తిరుమల కృష్ణమాచార్యులు, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ఊగ మునిత, పట్టణ అధ్యక్షుడు మచ్చ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

'సఖి'తో బాధిత మహిళలకు సాంత్వన

గీసుకొండ : సఖి కేంద్రాలతో బాధిత మహిళలకు, బాలికలకు సాంత్వన లభిస్తుందని లీగల్ కౌన్సిలర్ శోభారాణి తెలిపారు. మండలంలోని కొమ్మాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో నర్సింహస్వామి వీఓ గ్రూపు మహిళలకు అవగాహన కల్పించారు. శోభారాణి మాట్లాడారు. కార్యక్రమంలో వీఓఏ రాజు, ఏబీలు సౌందర్య, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటలో మహాశక్తి వీఓ గ్రూపు సభ్యులకు సఖి కేంద్రం సేవల గురించి లీగల్ కౌన్సిలర్లు శోభారాణి, సుధ అవగాహన కల్పించారు. అనంతరం సఖి సేవలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీసీ స్కెచ్, విఓఏ అధ్యక్షురాలు అనిత, తదితరులు పాల్గొన్నారు.